క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


సుద్దమల్ల శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు


కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె నపాలిమేరలో వెలసిన వాసాపురం వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీ శర్మ, శివ ఉదయాన్నే స్వామి అమ్మ వార్లకు నిత్య పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తాదులు గంటల కొద్ది క్యూలైన్‌లో వేచి ఉండి స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులతో సామూహిక కుంకుమార్చన చేయించారు.

విద్యార్థులు ఉద్యమించాలి


మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఉద్యమించాలని ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పద్మావతినగర్ వద్ద ఉన్న వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాడాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, సురేష్, లోకేష్, వెంకటేష్, రమణ, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం విజయవంతం


దంత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నంద్యాల కే.ఎం.రెడ్డి డెంటల్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మల్లేష్ రెడ్డి రోగుల దంతాలకు వైద్య పరీక్షలు, ఎక్స్‌రే వంటివి చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పరీక్ష లు చేయించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యు లు మధుసూదనరెడ్డి, రంగనాయకులు, నరసింహులు, గురువయ్య, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస రెడ్డి, కేశవరెడ్డి, సత్యనారయణ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి విశేష పూజలు


తమలపాకుల అలంకరణలో అభయాంజనేయ స్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని టెక్కె వీధిలో వెలసిన నాగులకట్ట దేవాలయంలో అధిక శ్రావణ మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్టుకు ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, సింధూర అభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి వడ మాల, సామూహిక కుంకుమార్చన జరిపించి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మహామంగళ హారతులు నిర్వహించి భక్తులకు వడపప్పు,పానకం ప్రసాదంగా అందజేశారు. ఆలయ నిర్వాహకులు మధుసాయి, రాధాకృష్ణ, వెంకట్వేర్లు, రామకృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

అణువణువూ శోధించి..

వారి చేతుల్లో నిత్యం బంగారం ఉంటుంది.. అయినా ధనవంతులు కాదు.. పూట గడపుకోవడానికి నానా అవస్థలు పడుతుంటారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు బంగారం కోసం అన్వేషిస్తుంటారు.. కానీ వారు.. బంగారు గనుల్లో పనిచేయడం లేదు.. మరెవరునుకుంటున్నారా.. బంగారు దుకాణాలు, ఆభరణాలు తయారు చేసే ప్రాంతాల్లోని మురుగు కాల్వల్లోని మురుగు మట్టిని, రోడ్లపై మట్టిని సేకరించి అందులో కలిసిన బంగారు రేణువులను వేరు చేసి జీవనం సాగిస్తున్నారు పట్టణంలోని యానాదుల తెగ వాసులు.

- బంగారు షాపుల ముందు మురుగు కాల్వల్లోని మట్టితో ఉపాధి
- తెల్లవారుజాము నుంచే కాల్వల్లోని మట్టిని జల్లెడ పట్టి బంగారం కోసం వెతుకులాట
- వీధుల్లోని మట్టినీ సేకరిస్తున్న వైనం
- ఉపాధిగా మార్చుకున్న 'యానాదులు'

నంద్యాల(వ్యవసాయం): తెల్లవారుజామునే వారు బంగారు షాపుల ముందున్న మురుగు కాల్వల్లో వాలిపోతారు.. అందులోనున్న మురుగు మట్టిని తీస్తారు.. మురుగు కాల్వల్లో దుర్గంధం వెదజల్లుతున్నా వారికి సాధారణమే.. పొట్ట కూటి కోసం వారు పడుతున్న పాట్లు చూపరులకు ఆవేదన కలిగిస్తుంది. ఉదయం నుంచి కష్టపడి కాల్వల్లో ఉన్న మట్టి, మురుగును తీయడంతో పాటు బంగారు షాపుల ముందు ఉన్న రోడ్లను శుభ్రం చేసి మట్టిని సేకరించుకుంటారు. వీటిలో ఉన్న బంగారు రేణువుల కోసం వీరు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. నంద్యాల పట్టణంలోని బంగారు షాపుల వీధి (మెయిన్‌బజార్)లో వేకువజాము నుంచి సుమారు 30 మంది ఇలా చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

తెల్లవారుజాము నుంచే..

పట్టణంలోని మెయిన్‌బజార్‌లో బంగారు దుకాణాలు, ఆభరణాలు తయారు చేసే, మరమ్మతులు చేసే దుకాణాల ముందున్న మురుగు కాల్వల్లో రోజూ వేకువజామున 4 గంటల నుంచి యానాదుల కుటుంబాలకు చెందిన సుమారు 30 మంది మలిన మట్టిని, షాపుల ముందు రోడ్లపైనున్న మట్టిని సైతం సేకరిస్తారు. అంగళ్లలోని వినియోగదారులు, షాపుల యజమానులు బంగారు వస్తువులు రిపేరీ, నాణ్యత పరిశీలన కోసం ఆకురాయిపై సాన పట్టడం తెలిసిందే. ఇలా పట్టినప్పుడు వచ్చే బంగారు రేణువులు గాలిలో ఎగిరిపోవడం, కాల్వల్లో పడుతుంటాయి. వినియోగదారుల పాదాలు, దుస్తుల ద్వారా అవి షాపుల ముందు పడతాయి. బంగారు రిపేరీ షాపుల్లో పాత ఆభరణాలను కరిగించే క్రమంలో మలిన పదార్థాల ద్వారా చిన్నరేణువుల రూపంలో మురుగు కాల్వల్లో చేరుతుంటాయి. దీంతో ఆ రేణువుల కోసం యానాదులు మురుగు మట్టిని శుభ్రం చేసి, యాసిడ్‌లో మరిగిస్తారు. దీంతో మట్టి, ఇనుము, వెండి, బంగారు రేణువులు అడుగు భాగంలో చేరతాయి. వాటికి సీసంను కలపడం ద్వారా సీసానికి బంగారు రేణువులు మాత్రమే అతుక్కుంటాయి. తర్వాత సీసంలో అతుక్కున్న బంగారు రేణువులను విడదీస్తారు. ఇలా సేకరించిన బంగారు రోజుకు మిల్లీ గ్రాముల్లో లభ్యమవుతుంది. ఒక్కో రోజు వారి అదృష్టాన్ని బట్టి రెండు, మూడు గ్రాముల వరకూ లభిస్తుంది. అలా వచ్చిన బంగారాన్ని విక్రయించగా వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటారు. ఇలా రోజూ దొరుకుతుందంటే పొరపాటే..ఒక్కో రోజు ఏమీ లభించక ఒట్టి చేతులతో ఇంటికి వెళ్తే.. ఆ రోజు తాము పస్తులుండాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి, మురుగు బురద నుంచి బంగారును వేరు చేయడానికి రోజుకు రూ.100 వరకు ఖర్చు వస్తుందని చెబుతున్నారు. పూడిక తీసే సమయంలో కొన్ని సందర్భాల్లో ఇనుప చువ్వలు, గాజు పెంకులు గుచ్చుకుని గాయాలైన సందర్భాలూ లేకపోలేదంటున్నారు. ఆ గాయాలు ఒక్కొక్కసారి ఇన్ఫెక్షన్‌గా మారి తీవ్ర తరం అవుతుంటాయని, అయినా తమతో పాటు కుటుంబం కడుపు నింపాలంటే ఇలాంటివి తప్పదంటున్నారు.


బంగారు రేణువుల కోసం మురుగు కాల్వలోని మట్టిని కడుగుతున్న దృశ్యం


షాపుల వద్ద డ్రైనేజీల్లోని మట్టిని సేకరిస్తున్న దృశ్యం




మురుగు కాల్వ నుంచి మట్టి సేకరిస్తున్న మహిళ

నీటి సమస్యకు పరిష్కారం

చాగలమర్రి: మండలంలోని పెద్ద బోధనం గ్రామంలో కొన్ని రోజులుగా గంగమ్మ గుడి వద్ద ఉన్న పంచాయతీకి చెందిన బోరులో మోటారు చెడిపోవడంతో గ్రామంలో నీటి సమస్య ఏర్పడింది. సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లటంతో సర్పంచ్ ముడియం శివమ్మ రూ.24 వేల పంచాయతీ నిధులతో కొత్త విద్యుత్ మోటారు కొనుగోలు చేసి బోరులో అమర్చినట్లు చెప్పారు. దీంతో గ్రామంలో నీటి సమస్య పరిష్కారం అయ్యిందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రికెట్ పోటీల్లో పాల్గొన్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని నంద్యాల అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రఘుప్రకాశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యాంత్రిక జీవనం నుంచి ఉపశమనం పొందటానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. షటిల్, చదరంగం, క్యారం బోర్డు, మ్యూజికల్ చైర్ తదితర ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ఆగస్టు 15న న్యాయమూర్తులతో అందజేయిస్తామని చెప్పారు. ప్రతాపరెడ్డి, ప్రసాద్ రెడ్డి, కిరణ్, ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

పథకాలతో ప్రతి గడపా సుభిక్షం


లబ్ధి పొందిన పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: నవరత్నాలు పథకాలతో ప్రతి గడపకు సంక్షేమ లబ్ధి చేకూరిందని, జగనన్న పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం చింతకుంట గ్రామంలో గడప గడపను సందర్శించారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి కుటుంబానికి అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలంటూ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కారం చేశారు. మరికొన్నింటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, సింగం వెంకటేశ్వర్ రెడ్డి, రంగేశ్వర్‌రెడ్డి, పలచాని మల్లికార్జునరెడ్డి, ఇంజేటి నాగిరెడ్డి, శివనాగిరెడ్డి, శంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి, కౌన్సిలర్‌లు వరప్రసాద్‌రెడ్డి, నరసింహులు, మహబూబ్‌బాషా ఉన్నారు.


40 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఎస్పీజీ హైస్కూల్ 1982–83 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. 40 ఏళ్ల క్రితం ఒకే చోట చదువుకున్న వారంతా ఒకే చోట కలవడంతో వాతావరణం సందడిగా మారింది. పూర్వ విద్యార్థులు దాసరి చింతలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం


స్పృహ కోల్పోయిన దూదెకుల ఉదయ్‌కిరణ్, నాగిరెడ్డి వెంకటసుబ్బుడు

చాగలమర్రి : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కూలురు చౌరస్తా వద్ద శనివారం ఉదయం మోటారు సైకిల్, ఆటో ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే స్పృహ కోల్పోయి పడిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇరువురి పరిస్థితి విషమించటంతో నంద్యాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. చాగలమర్రి ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రిలోని కోటగడ్డ వీధికి చెందిన వుశేన్‌వలి సొంత ఆటోలో కులూరు రస్తాలో ఉన్న తన పొలం వద్దకు వెళ్లి ఇంటికి వస్తుండగా కులూరు చౌరస్తా వద్దకు చేరుకోగానే ఆళ్లగడ్డ వైపు నుంచి ఆళ్లగడ్డ టౌన్, నగరం కాలనీకి చెందిన దూదేకుల ఉదయ్‌కిరణ్, నాగిరెడ్డి వెంకటసుబ్బుడు, శేఖర్ ఎపి21 ఎటి 1782 నంబరు గల మోటారు సైకిల్‌పై మైదుకూరుకు వెళ్తూ అదుపు తప్పి ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న వుశేన్‌వలికి స్వల్ప గాయాలు కాగా, మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న దూదేకుల ఉదయ్‌కిరణ్, నాగిరెడ్డి వెంకటసుబ్బుడు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు. శేఖర్ అనే వ్యక్తికి స్వల్ప గాయలయ్యాయి. కేసు నమోదు చెసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్సీ గంగుల, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని రాష్ట్ర జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. రుద్రవరం మండలం పేరూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కోతి సుబ్బరాయుడు, చిన్న మధుసూదన్, బాలనాగన్న, లక్ష్మీగురువయ్య, రామగురువయ్య, మధుసూదన్, బాలరాజు, నాగేషులుతో పాటు మరో 10 కుటుంబాలకు చెందిన వారు శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విజయ డెయిరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ నాయకులు తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, కోనేటి దేవదానం, వెంకటేశ్ ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

గోస్పాడు: ఇటీవల సర్దుబాటు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు వేతనాలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు జీతాలు లేక రెండు నెలల నుంచి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయులు సుబ్బరాయుడునాయక్, సురేష్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, సికిందర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఈఓఆర్‌డీ అనసూయ సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వర్షా కాలం కావడంతో గ్రామాల్లో అంతర్గత వీధుల వెంట చెత్తా చెదారం, మురుగు నీరు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

ఉయ్యాలవాడ : గృహ ఆవరణ, పరిసరాలను శుభ్రంగా వుంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వెంకటలక్ష్మి కళాజాత బృందం పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ఆట,పాటల ద్వారా అవగాహన కల్పించారు. ప్రజలకు వచ్చే అంటువ్యాధులు, ఆరోగ్యం దెబ్బతినే తీరును పాటల రూపంలో వివరించారు. కళాజాత ప్రజలను ఆకట్టుకుంది.

ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.నిర్మల ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో శోభారాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సునీతమ్మ, నాగరాణి, మంజుల ప్రమీళమ్మ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేయాలి

మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా పంపింగ్ స్టేషన్–1 నుంచి కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు నీరు విడుదల చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ కోరారు. శనివారం ఈ మేరకు ఈఈ తిరుమలేశ్వర రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

నంద్యాల(న్యూటౌన్): సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హృదయరాజు అన్నారు. శనివారం ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట చైర్మన్ మాధవస్వామి, సెక్రెటరీ సుబ్బన్న ఆధ్వర్యంలో 12గంటల ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేయాలని, దీని ద్వారా పేద, బడుగు, బలహీన మైనార్టీ వర్గాలకు విద్య అందకుండా పోతుందన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీటీఎఫ్ నాయకులు శివయ్య, యూటీఎఫ్ నాయకుడు ప్రసాద్, ఎస్‌టీయూ నాయకులు మౌలాలి, అజాంబేగ్, జిల్లి, సుధాకర్, డీటీఎఫ్ నాయకులు కిశోర్, హెచ్‌ఎంఏ నాయకులు సురేంద్ర, లింగన్న, ఎస్సీ, ఎస్టీ ఉపా ధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, జమాన్, దస్తగిరి, ఏపీటీఎఫ్ 1938 కార్యదర్శి శ్రీనివాసులు, చంద్రశేఖర్, గోపాలకృష్ణ, పీఈ టీ డీపీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల రవికుమార్, రామనర్సింహం పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటా ఓటరు సర్వే

దొర్నిపాడు: మండలంలో శనివారం ఇంటింటా ఓటరు సర్వేలో భాగంగా స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం నిర్వహించారు. బీఎల్‌ఓలు శ్రీనివాసులు, ఉశేనమ్మ తదితరులు ఆయా గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను తెలుసుకున్నారు. 18 ఏళ్లు పూర్తయిన వారు ఉంటే ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే సవరణలు, పోలింగ్ కేంద్రం మార్పు తదితర వాటికి అవకాశం ఉందన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

చాగలమర్రి: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతు నాయక్ తెలిపారు. సీఐగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం హమాలీ యూనియన్ నాయకులు సీఐని సన్మానించారు. ఎస్‌ఐ రమణయ్య ఉన్నారు.

ఈవెంట్స్‌తో విద్యార్థుల్లో చైతన్యం



మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి.


సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

నంద్యాల(న్యూటౌన్): ఈవెంట్స్ వల్ల విద్యార్థుల్లో మనో విజ్ఞాన ప్రజ్ఞ పెరుగుతుందని, అప్పుడే విద్యార్థులు చైతన్యవంతులుగా తయారు అవుతారని నంద్యాల పార్లమెంట్ సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ స్థాయి అండర్ గ్రాడ్యుయేట్ ఫెస్టివల్ వసంతోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మొదటగా జ్యోతి ప్రజ్వలన, 2కే 23 స్వాగత నృత్యంతో ప్రారంభించారు. స్ప్రింగ్ ఫెస్ట్‌లో ముఖ్యంగా ట్రేజంటం, పద్మవ్యూహం, బ్రిలియంట్ బ్రెయిన్, ఫజ్లల్, కల్చరల్ యాక్టివిటీలు ఉన్నాయి. బీబీఏ విద్యార్థుల ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. పది సంవత్సరాలుగా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ఎస్‌ఆర్‌కే ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ విజయకుమారి, మేనేజర్ ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం


రాయమాల్పురంలో మొక్క నాటుతున్న రూప్‌కుమార్

నంద్యాల(అర్బన్): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నాభూమి–నాదేశం కార్యక్రమ నిర్వాహక రాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ రూప్‌కుమార్ తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా శనివారం మండలంలోని రాయమాల్పురంతో పాటు వివిధ గ్రామాల్లో నాభూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. రాయమాల్పురంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీతో కలిసి మొక్కలు నాటారు. పులిమద్ది సర్పంచ్ రఘురామిరెడ్డి, రామలక్ష్మమ్మ, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు డైరెక్టర్ భూమా చెంచిరెడ్డి, మోహన్‌నాయుడు, వెంకటసుబ్బనాయుడు, ఈసీ సోమశేఖర్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: దేశ సమగ్రత, సౌభ్రాతృత్వంపై భావితరాల్లో స్ఫూర్తి నింపడమే నా భూమి–నాదేశం కార్యక్రమం ఉద్దేశమని సీఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ (లీగల్) పీపీ రూప్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చాకరాజువేముల గ్రామంలో నా భూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. అలాగే కొండాపురంలో సర్పంచి మాధవీ లత, రామచందారపురం గ్రామంలో నామట్టి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, బనగానపల్లె ఏపీడీ సాంబశివుడు, సొసైటీ